## కేఎల్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీలో.. యూజీ, పీజీ ప్రోగ్రామ్ దరఖాస్తులకు ఆహ్వానం



కేఎల్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ

మాదాపూర్, డిసెంబర్ 7: అకాడమిక్ ఎక్సలెన్స్ పట్ల అచంచలమైన నిబద్ధతకు పేరుగాంచిన విశ్వవిద్యాలయంగా గుర్తింపు పొందిన కేఎల్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ– 2024 విద్యా సంవత్సరానికి గాను అడ్మిషన్లు, అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌ల కొరకు దరఖాస్తులను ఆహ్వానించింది. వివిధ విభాగాల్లో ఔత్సాహిక విద్యార్థులకు ప్రపంచస్థాయి విద్యను అందించనున్నట్లు యూనివర్సిటీ అధ్యాపకులు తెలిపారు. కేఎల్ఈఈఈ – ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష, కేఎల్ఎస్ఏటీ– సైన్స్ సంబంధిత ప్రోగ్రామ్‌ల కొరకు వెతుకుతున్న సైన్స్ ఆప్టిట్యూడ్ టెస్ట్, కేఎల్ఈసీఈటీ– ఇంజినీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (డిప్లొమా/పాలిటెక్నిక్ విద్యార్థులు), కేఎల్‌హెచ్ఏటీ – హ్యుమానిటీస్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (గ్రాడ్యుయేషన్ కోర్సులు), కేఎల్ఎంఏటీ– మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (పీజీ కోర్సులు) డిసెంబర్ 15 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించే ఈ పరీక్షల్లో అర్హత పొందడం ద్వారా 2024 సంవత్సరానికి కేఎల్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీలో అడ్మిషన్లు పొందవచ్చన్నారు. దరఖాస్తు గడువు డిసెంబర్ 13వ తేదీగా పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు యూనివర్సిటీ వెబ్ సైట్ https://www.kluniversity.in/ ని సందర్శించి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చని తెలిపారు. విజయాలను ప్రోత్సహించడానికి, ప్రతిభను పెంపొందించడానికి విశ్వవిద్యాలయం–2024లో మెరిట్ స్కాలర్‌షిప్‌ల కొరకు రూ. 100 కోట్ల ప్రయోజనకరమైన కేటాయింపును విడుదల చేసినట్టు అధ్యాపకులు తెలిపారు.

## పెట్ గ్రూమింగ్ సర్వీసెస్ బై బైక్ సేవలు ప్రారంభం



పెట్ గ్రూమింగ్ సర్వీసెస్ బై బైక్ సేవలను ప్రారంభించిన శ్రీనివాస రావు

కొండాపూర్, డిసెంబర్ 7: పెంపుడు జంతువులకు మెరుగైన సేవలను ఇంటి దగ్గరే అందించేందుకు సరికొత్తగా పెట్ ఫోక్ సంస్థ 'పెట్ గ్రూమింగ్ సర్వీసెస్ బై బైక్'ను గురువారం ప్రారంభించింది. నాలెడ్జ్ సిటీలోని టీ – హబ్ వద్ద ప్రారంభించిన ఈ కార్యక్రమానికి టీ – హబ్ సీఈఓ ఎం.శ్రీనివాస రావు ముఖ్య అతిథిగా హాజరై.. జెండా ఊపి బైక్ సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తక్కువ ఖర్చుతో పెంపుడు జంతువులకు అవసరమైన అన్ని రకాల సేవలను ఇంటి వద్ద అందించనున్నట్లు తెలిపారు. గతంలో పెట్స్ కేర్ కోసం ప్రత్యేక వాహనాన్ని ఏర్పాటు చేయగా, ఖర్చులను తగ్గించేందుకు బైక్ సేవలను అందుబాటులోకి తీసుకురావడం జంతు ప్రేమికులకు ఊరటనిస్తుందన్నారు. ఈ సేవలను జంతు ప్రేమికులు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పెట్ ఫోక్ వ్యవస్థాపకులు లక్ష్మీకాంత్, జంతు ప్రేమికులు, తదితరులు పాల్గొన్నారు.

## రౌడీ షీటర్ అరెస్ట్




చిక్కడపల్లి పోలీసులు అరెస్టు చేసిన రౌడీ షీటర్ సంతోష్

చిక్కడపల్లి, డిసెంబర్ 7: రాష్ట్ర వ్యాప్తంగా నేరాలకు పాల్పడుతున్న రౌడీ షీటర్‌ను చిక్కడపల్లి పోలీసులు గురువారం అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ సీతయ్య కథనం ప్రకారం.. న్యూ బోయిగూడ జీకే కాలనీలో నివాసముంటున్న ముండగళ్ల సంతోష్ (40) ఆటో డ్రైవర్. పేరు మోసిన నేరగాడు. చాలా కాలంగా పోలీసులకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. మూడుసార్లు పీడీ యాక్ట్ కింద పోలీసులు కేసులు నమోదు చేశారు. నిందితుడుపై ఐదు నాన్ బెయిలబుల్ వారెంట్లు పెండింగ్‌లో ఉన్నాయని, రాష్ట్ర వ్యాప్తంగా 18 కేసులు ఉన్నాయని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.



రాజ్యసభ సభ్యులు సంతోష్ కుమార్ జన్మదినం సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు నెర్ధం భాస్కర్‌గౌడ్ గురువారం మొక్కలు నాటారు. ఈ మేరకు గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా మొక్కలు నాటి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయిజెన్ శేఖర్, బన్నాల ప్రవీణ్, మహేశ్ గౌడ్, పల్లె నర్సింగ్‌రావు, తదితరులు పాల్గొన్నారు. *- ఉప్పల్, డిసెంబర్ 7*



రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్‌కుమార్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపిన గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ నాయకులు అశీష్‌కుమార్ యాదవ్ *- అబిడ్స్, డిసెంబర్ 7*

# పార్సిల్ పేరుతో సైబర్ వల..

- హడలిపోయి వలలో చిక్కుతున్న బాధితులు
- కుటుంబ సభ్యులతో చర్చించండి
- పోలీసులకు సమాచారమివ్వండి




సిటీబ్యూరో, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ): యూకే నుంచి మీ పేరుతో పార్సిల్ వచ్చింది.. అంతర్జాతీయ స్థాయిలో వచ్చిన కొరియర్. దానిని మేం ఎక్కువ రోజులు ఇక్కడ ఉంచుకోలేము.. ఈ పార్సిల్‌కు డెలివరీ చార్జీలు కూడా చెల్లించలేదు.. స్కాన్ చేస్తే అందులో పౌండ్స్ ఉన్నాయి.. అంటూ ఢిల్లీ ఎయిర్ పోర్టు అధికారుల పేరుతో బెదిరింపులు...

❖ మీ పేరుతో ఆఫ్రికా నుంచి ఒక పార్సిల్ వచ్చింది. అందులో డ్రగ్స్ ఉన్నాయి. మేం దీనిపై సీబీఐకి ఫిర్యాదు చేస్తున్నాం. వెంటనే దీనిపై ఒక నిర్ణయం తీసుకోండి. మేం ముంబై ఎయిర్ పోర్టు నుంచి మాట్లాడుతున్నాం.. అంటూ బెదిరింపులు...

ఇలా వస్తున్న బెదిరింపులతో హడలిపోతున్న బాధితులు భయంతో వెంటనే సైబర్‌నేరగాళ్లు సూచించే ఖాతాల్లో డబ్బు డిపాజిట్ చేస్తూ మోసపోతున్నారు. బాధితుల భయం.. నేరగాళ్లకు వరంగా మారుతోంది. ఇలాంటి ఫోన్స్ రాగానే తెలిసిన వారి సహాయం తీసుకొని, వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలి. అయితే, తెలిసిన వారికి, పోలీసులకు చెబితే పరువుపోతుందన్న భయంతో చాలా మంది నేరగాళ్ల వలకు చిక్కుతున్నారు. వారు చెప్పినట్టు చేస్తూ డబ్బులు పోగొట్టుకుంటున్నారు.

### చెల్లించక ముందే చెబితే..!

గుడిమల్కాపూర్‌లో నివాసముండే ఓ ప్రైవేట్ ఉద్యోగినికి లింక్‌డ్ ఇన్ ద్వారా యూకేలో ఉండే ఒక వ్యక్తి పరిచయమయ్యాడు. ఈ క్రమంలో వారు చేసే వృత్తి గూర్చి మాట్లాడుకోవడంతో పాటు తల్లిదండ్రుల ఆరోగ్య సమస్యలపై కూడా చర్చించుకున్నారు. కొన్ని రోజుల తరువాత ఢిల్లీ ఎయిర్‌పోర్టు నుంచి రాకేశ్‌ను మాట్లాడుతున్నాను.. మీ పేరుతో లండన్ నుంచి ఒక పార్సిల్ వచ్చిందంటూ చెప్పాడు. అందులో అడ్రస్ కూడా చెప్పాడు. లింక్‌డిన్‌లో పరిచయమై.. ఆ తరువాత +44 వాట్సాప్ నంబర్‌తో చాట్ చేసిన వ్యక్తి పంపించాడని ఆమె గ్రహించింది. ఆ పార్సిల్ మీకు పంపించాలంటే దానికి డెలివరీ ఛార్జీలు రూ. 42,999 చెల్లించాలంటూ షరతు విధించాడు. డబ్బులు పంపేందుకు సిద్ధమవుతున్న సమయంలోనే, రాకేశ్ ఆమె ఫోన్‌కు మెసేజ్ పెట్టాడు. ఆ పార్సిల్‌ను స్కాన్ చేస్తే అందులో 80 వేల పౌండ్లు ఉన్నాయని తెలిసిందని, దీనికి యాంటీ మనీ లాండరింగ్ సర్టిఫికెట్ అవసరమంటూ సూచించాడు. దానికి రూ. 2 .15 లక్షలు ఖర్చవుతుందంటూ చెప్పాడు. మీరు త్వరగా చెల్లిస్తే పార్సిల్ పంపిస్తాను.. లేదంటే మీ ఇష్టమంటూ రాకేశ్ తేల్చి చెప్పాడు. వెంటనే తనకు లింక్‌డిన్‌లో పరిచయమైన యూకేలోని వ్యక్తికి మెసేజ్ చేసింది. అవును ఆ పార్సిల్ నేను పంపించాను.. మీ అమ్మకు ఆపరేషన్ ఖర్చుల కోసం అంటూ చెప్పాడు. నాకు సమస్య తెచ్చిపెట్టకు.. నీవు వెంటనే ఆ ఫీజులు చెల్లించి, ఆ పార్సిల్ తెప్పించుకోమంటూ సూచించాడు. తన కోసం నిజంగానే పంపించాడనే భావనతో తన స్నేహితుల వద్ద లక్ష రూపాయలు అప్పుగా తీసుకొని.. నేరగాడు సూచించిన ఖాతాలోకి డిపాజిట్ చేసింది. ఇంకా డబ్బు కావాలంటూ అడగడంతో అనుమానం వచ్చి తనకు తెలిసిన చార్టెడ్ అకౌంటెంట్‌కు ఫోన్ చేసింది. ఆ తరువాత విషయాన్ని ఆమె భర్తకు చెప్పింది.ఇదంతా ఫేక్ అని, వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయమంటూ సూచించడంతో సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

❖ నగరానికి చెందిన ఒక మహిళకు.. ముంబై ఎయిర్‌పోర్టు నుంచి కస్టమ్స్ అధికారులం మాట్లాడుతున్నామంటూ ఫోన్ చేశారు. మీ పేరుతో ఆఫ్రికా నుంచి ఒక పార్సిల్ వచ్చిందని చెప్పారు. తనకు ఎవరు ఆఫ్రికాలో తెలియరని, మీరు పొరపాటుగా ఫోన్ చేశారని బాధితురాలు సూచించింది. అది కాదని.. మీ ఆధార్ కార్డులో ఉన్న అడ్రస్ ఇదే కదా.. అంటూ చదివారు. ఆ అడ్రస్ తనదేనంటూ ఆమె ఖంగుతిన్నది. ఈ పార్సిల్‌లో డ్రగ్స్ ఉన్నాయి.. మీరు ఇక్కడికి రావాల్సి ఉంటుంది.. ఈ పార్సిల్‌ను సీబీఐకి అప్పగిస్తామంటూ బెదిరింపులకు దిగారు. తనకు సంబంధం లేదంటూ ఆమె బాధగా మాట్లాడుతుండటంతో.. మీకు ఒక నంబర్ ఇస్తాను.. అతడితో మాట్లాడితే సమస్య పరిష్కారమవుతుందంటూ సూచించారు. దీంతో బాధితురాలు అతడికి ఫోన్ చేసి.. ఈ సమస్య నుంచి ఎలాగైనా బయటపడేయాలని వేడుకుంది. ఒక నంబర్ పంపిస్తాను.. ఆ నంబర్‌కు రూ. 50 వేలు పంపించండి.. అంటూ నమ్మించి.. ఆ డబ్బు లాగేశారు. ఆ తరువాత సీబీఐ వాళ్లు ఫోర్స్ చేస్తున్నారంటూ మరో రూ. 50 వేలు డిమాండ్ చేశాడు. ఇలా రూ. 2 లక్షలు స్వాహా చేశారు. ఈ విషయాన్ని బాధితురాలు భర్తకు చెప్పడంతో.. ఇదంతా మోసమని, పోలీసులకు ఫిర్యాదు చేయలంటూ సూచించాడు. సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### ఒక్కక్షణం ఆలోచించండి..!

మీకు సంబంధం లేకుండా విదేశాల నుంచి ఎవరు పార్సిల్ పంపిస్తారు. వాళ్లకు అవసరమేంటీ. ఎలాంటి సంబంధం లేకుండా వేలాది డాలర్లు, పౌండ్స్ ఎందుకు పంపిస్తారు. మీ పేరుతో డ్రగ్స్ పంపించాల్సిన అవసరం వాళ్లకు ఎందుకొచ్చింది. మీకు డ్రగ్స్ పంపిస్తే వాళ్లకు వచ్చే లాభమేంటి.. అనే విషయాలపై మీలో మీరు ప్రశ్నించుకోండి. ఇలాంటి ఫోన్‌కాల్స్ వస్తే వెంటనే అనుమానించి కుటుంబ సభ్యులకు, స్నేహితులకు, పోలీసులకు తెలియజేయండి. బ్లాక్ మెయిలింగ్‌కు భయపడకండి. అత్యాశకు పోయి బోర్ల పడవద్దు.. అంటూ పోలీసులు సూచిస్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఇలాంటి ఫోన్ కాల్స్‌పై పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. పై రెండు ఘటనల్లో మొదటి ఘటనలో.. బాధితురాలు మరింత ముందుగా స్పందించి ఉంటే నష్టం జరిగేది కాదని, రెండో ఘటనలో ధైర్యంగా నాకు సంబంధం లేదని చెప్పినా.. ఇతరులతో చర్చించినా డబ్బు పోయేది కాదని పోలీసులు తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌తో హడలిపోకుండా, ఆ కాల్‌పై ఇతరులతో చర్చించి నిర్ణయం తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.

## పాక్సో కేసులో నేరస్తుడికి జైలు

జీడిమెట్ల, డిసెంబర్ 7: మూడేండ్ల కిందట కూతురిపై లైంగికదాడికి పాల్పడ్డ కేసులో నిందితుడికి శిక్ష పడింది. జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ పవన్ కథనం ప్రకారం.. చింతల్ ప్రాంతానికి చెందిన సునీల్‌కుమార్ (44)కూలీ. అతడు 2019లో తన కూతురిపైనే లైంగికదాడికి పాల్పడినట్టు జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. కుమారుడు అనారోగ్యంతో ఉండటంతో భార్య ఆసుపత్రికి వెళ్లగా.. ఇంట్లో ఉన్న బాలిక (12)పై లైంగికదాడికి పాల్పడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో గురువారం మేడ్చల్ కోర్టు నిందితుడికి శిక్ష ఖరారు చేసింది. నేరస్తుడికి 20 ఏండ్ల జైలు శిక్షతోపాటు జరిమానా విధించినట్టు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

## ఈ నెల 9న.. పది ఎంఎంటీఎస్ రైళ్లు రద్దు

సిటీబ్యూరో: సికింద్రాబాద్, హైదరాబాద్ సబర్బన్‌కు చెందిన పది ఎంఎంటీఎస్ లోకల్ రైలు సర్వీసులు ఈ నెల 9వ తేదీన రద్దు చేస్తూ గురువారం రైల్వే అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఆయా మార్గంలో రైల్వే నిర్వహణ పనుల వల్ల కలిగే అంతరాయంతో ఈ లోకల్ రైళ్లను రద్దు చేసినట్లు తెలిపారు. లింగంపల్లి – ఫలక్‌నుమా, ఫలక్‌నుమా– సికింద్రాబాద్, లింగంపల్లి– ఉందానగర్, కర్నూల్‌సిటీ– కాచిగూడ, కాచిగూడ –మహబూబ్‌నగర్ వంటి పలు స్టేషన్ల పరిధిలో రైళ్లను రద్దు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

### 107 మంది పిల్లలను కాపాడిన ఆర్‌పీఎఫ్..

గత నవంబర్ నెలలో పలు రైల్వే స్టేషన్ల పరిధిలో మొత్తం 107 మంది పిల్లలను రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్) కాపాడింది. ఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే ' ఆపరేషన్ నాన్ హే ఫారిస్తే' ద్వారా నవంబర్‌లో కుటుంబ సమస్యలు, వివిధ కారణాల వల్ల తప్పిపోయిన, లేదా పారిపోయిన వారిని గుర్తించి, వారిని సంరక్షించే కార్యక్రమాన్ని ఆర్‌పీఎఫ్ చేపట్టింది. దీని ద్వారా మొత్తం 93 మంది బాలురు, 14 మంది బాలికలను రక్షించి, వారికి భద్రత కల్పించారు. అలాగే, రైల్వే ద్వారా మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ 'ఆపరేషన్ నార్కోస్' ప్రారంభించి.. రూ.1.79 కోట్ల విలువైన గంజాయిని పట్టుకుంది. 30 మంది నిందితులను అరెస్టు చేసినట్లు ఆర్‌పీఎఫ్ తెలిపారు.